


ల్యాణి కాపురానికొచ్చాక సత్యనారాయణరావు, విడిగా కాపురం పెట్టాక సరిగ్గా ఒక దీపావళే వచ్చింది.

సత్యనారాయణరావుకు దీపావళిపండుగంటే– అన్ని పండుగల్లోకి గొప్పది. చేతి జల్బు వదలించే పండగల్లో యిదో పండగన్న ఉద్దేశం అతనికసలు లేనేలేదు. తమ అన్నదమ్ములంతా కలసిఉన్నంతకాలం, దీపావళి పండుగలకు కావలసిన సామానంతా వాళ్ళే అంతా కలసి కట్టేశేవారు. ఇప్పుడు ఆస్తిపాస్తులు పంచుకొనటంతో అభిప్రాయభేదాలు యేర్పరుచుకొని, ఒకళ్ళముఖం ఒకళ్ళు చూసుకోనివాళ్ళకు దీపావళి పండుక్కి సామానంతా కలసికట్టేద్దామనే ఉద్దేశం ఉంటే మాత్రం ఉపయోగం ఏమిటి?

అన్నదమ్ములందర్లోకి సత్యనారాయణరావే చిన్నవాడు. తల్లి ఒడిలో బిడ్డలాగ అన్నదమ్ములంతా కలిసిఉన్నంతకాలం బ్రతికాడు. ఎప్పుడయితే తల్లి మరణించిందో, మరి దాంతో వాటాలుపంచటం జరిగింది; సత్యనారాయణరావు తండ్రి జొత్తిగా, అతడి చిన్నతనంలోనే మరణించాడు

చిన్నవాడయిన సత్యనారాయణరావు, అన్నదమ్ము లందరికంటే కొద్దో గొప్పో చదువుకొన్నవాడవటంవల్ల నాగరికతాభిప్రాయాల్లో మున్గి తేలుతూ... జీవితంలోకి కళ్యాణిని కాపురానికి తీసుకొని వచ్చి నూతనాధ్యాయం ప్రారంభం చేశాడు.

కళ్యాణి కాపురానికొచ్చాక, అంటే– భర్తగారింటికివచ్చాక అదే ప్రథమదీపావళి. దీపావళిపండుగఅంతా సక్రమంగా జరుపుకొంటూంటే, అందరికంటే వైభవంగా (ప్రత్యేకంగా సామానువిషయంలోమాత్రం) జరుపుకొందామని సత్యనారాయణరావు ప్రయత్నిస్తూంటే... అడ్డంకుగా పండుగ పేరుతో కూతుర్నీ, అల్లుణ్నీ తీసుకొని వెడదామని వారంరోజులు ముందుగా కళ్యాణితండ్రి వచ్చాడు. కళ్యాణి ప్రథమంలో పుట్టింటికి వెళ్ళవచ్చుగదా అని ఉత్సాహపడిందికాని సత్యనారాయణరావు ఉద్దేశం ఆమెకు,అతడు తన తండ్రితో చెప్పేదాకా తెలియదు.

'మామగారూ...మీరు వెయ్యిచెప్పండి. లక్ష చెప్పండి. దీపావళికి ప్రత్యేకంగా... మీరు తీసుకొనివెళ్ళటం బాగుండలేదు. మరేపండుగపేరయినా చెప్పండి. తీసుకొని వెళ్ళండి నే వద్దన్ను, ఇద్దరం కలసి పదిరోజులు ముందుగానే వస్తాం. ఈవిషయంలో మాత్రం మరి చెప్పకండి'

సత్యనారాయణరావుమామ వెలవెలపోయాడు. 'ఏమిటో నువ్వనేది నాకేమీ అర్థంకావటం లేదు. ఇతరపండుగల్లో రావచ్చునంటున్నావ్. ఈ పండుగ విషయంలోఅలాచేయటానికి వీల్లేదంటున్నావ్, ఏమిటో నాకు కాస్త విమర్శి చెబుదూ' అని ప్రశ్నించాడు ఆయన.

'ఏంలేదండి, అది దీపావళిప్రత్యేకత. అంతకన్నా మరేంలేదు–' అన్నాడు సత్యనారాయణరావు.

'ఏమిటో ఆ ప్రత్యేకత... అన్నిపండుగల్లాంటిదేగా'– అన్నాడాయన.

'మీ కయితే అయిఉండొచ్చు, నాకు మాత్రంకాదు. దీపావళి పండుగ అన్నిపండుగల్లోకి వైభవంగా ఉండవల్సిన పండుగని నాఉద్దేశం.'

'అయితే అయ్యుండవచ్చు. దానికీ నువ్వుఅనేదానికీ సంబంధం యేమిటో నాకర్థమవటంలేదు' అన్నాడు సత్యనారాయణరావు మామ.

సత్యనారాయణరావు ఓపికతో మాట్లాడలేకపోయాడు. "దీపావళి పండుగ యిక్కడే వైభవంగా జరుపుకొందామని ఉద్దేశపడుతున్నానండి' అన్నాడతను.


వైభవంగాఅంటే?'ఇక్కడ చేసుకొనేంతటి వైభవంగాగా అక్కడా జరుపుకో

వచ్చు. ఇక్కడకూ, అక్కడకూ వ్యత్యాసం యేమిటీ. అది మీయిల్లుగానే భావించు... నీ కేవిధంగా యేర్పాటుచేయాలంటే ఆ విధంగా యేర్పాటుచేస్తా. నా మాటవిని వచ్చినన్ను సంతోషపరచండి' అన్నాడాయన.

'మామగారూ మీరు చెప్పేమాటలేమీ నా కర్థమవటంలేదు. కావలసినంత వైభవంగా యెక్కడయినా చేసుకోవచ్చు. ఆవిషయంలో మీరు దూరంగా మాట్లాడుతున్నారు. నే చేసుకోగూడదన్నానా?' అన్నాడు వెగటుగా సత్యనారాయణరావు.

'అయితే నువ్వు చెప్పేమాటల ధోరణి నా కర్థంగాకుండా ఉంది. అసలు నీఉద్దేశం యేమిటో తేల్చిచెప్పునాయనా,' అని ప్రశ్నించాడు మామగారు ప్రాధేయపూర్వకంగా.

ఇంతవరకు తన ఉద్దేశాన్ని వెడలగ్రక్కకుండా పైపై కబుర్లతో కాలక్షేపం చేశాడు సత్యనారాయణరావు. మరి అలాగా మాట్లాడితే పండుగసంగతి అటుంచి, తనకూ, మామగారికీ, మహావైభవంగా యుద్ధంజరిగేటట్లు కన్పిస్తూంది. అందువల్ల సత్యనారాయణరావు తన వుద్దేశాన్ని మామయెదుట వెడలగ్రక్క సిద్ధపడ్డాడు: దీపావళిపండుగవిషయంలో తాను, పత్నీసమేతంగా అత్తవారింటికి వెళ్ళకపోవటానికి కారణం, ఇక్కడ తాను బాణంసంచా తయారుచేసుకొన్న విధంగా, అక్కడ తయారుచేసుకొనటానికిగాని, కాల్చటానికి గాని వీలుండదు. ఎంత డబ్బు వెచ్చించినా అత్తవారింట చిన్నపిల్లలవిధంగా, తానూ బాణాసంచామీద మోజుమాపిసే తనంతా అవహేళనచేసారు. తన డబ్బుతో సరుకుకొన్న సంతృప్తి అప్పుడుండదు అప్పుడు భాగస్వాములు హెచ్చవుతారు ఏదోవిధంగా సరిపెట్టుకొందామనుకొంటే కుదరదు. అన్నింటికంటె ముఖ్యంగా, వీలయినంత సామానూ, తానే స్వయంగా, తయారుచేదామనే ఉద్దేశంలో ఉన్నాడు. మరి అత్తవారింటికి వెళ్ళేపక్షంలో సామాను తయారుచేయటం కష్టం. ఒకవేళ తయారుచేసినా, తాను తయారుచేసేసరుకుతో వాళ్ళను సంతృప్తిపరచటం కష్టం... సరుకు బాగున్నా, బాగులేకపోయినా, రేదో విధంగా యేవోపేర్లు పెడతారు: ఇదీ కేవలం దీపావళిపండుగకు అత్తవారింటికి సత్యనారాయణరావు బయలుదేరకపోవటంలోని ఆంతర్యం.



సత్యనారాయణరావు ఆ ఉద్దేశాన్నే మామయెదుట బహిర్గతపర్చాలని ఉద్దేశపడ్డాడు. కాని అయితే చదువుకొన్నవాడవటంవల్ల, ఆవిధంగా చెప్పటం చిన్నతనంగా ఉండటమే గాకుండా, మర్యాదహీనం అని వూహించి, మరోవిధంగా తన అభిప్రాయాన్ని బలపర్చాడు.

'కొత్తకాపురం. ఏమయినాసరే ఈయేటికి యిక్కడె పండుగ చక్కగా జరుపుకోవాలని నా ఉద్దేశం. అందుకోసం మమ్మల్ని యీ మారుకి యిబ్బంది పెట్టకండి.'

'సరే నీ యిష్టం- అయితే అమ్మాయి సంగతి'- సత్యనారాయణరావు మామ ప్రశ్నించాడు. 'నేనేం చెప్పను. కొత్తగా కాపురానికి రావటం- విడిపోయిన తర్వాత దీపావళిరావటం కొత్త. నట్టింట పండుగపూటా దీపం వెలిగించేవాళ్ళయినా లేకుండాచేస్తారా? నా ఉద్దేశంమాత్రం మీరామెను తీసుకొనివెళ్ళటం యిష్టంలేదు. తర్వాత ఆమెయిష్టమూ, మీ యిష్టమూ' అన్నాడు సత్యనారాయణరావు.

భర్తయిష్టప్రకారం నడుచుకొనటం, తన కర్తవ్యమన్న సంగతికళ్యాణికి తెలుసు. తన వుద్దేశప్రకారం ఒకమారు పండుగపేరుతో వెళ్ళి, పుట్టిల్లు, అక్కల్ని చూసిరావాలనిఉంది. కానయితే సత్యనారాయణరావు వీలులేదని మాచాయగా తేల్చినప్పుడు, తాను మొత్తపడటం అంత మంచిదికాదని ఆమె తలపోసింది. అందువల్లనే సత్యనారాయణరావు ఏం తేల్చకండా 'మీ యిష్టం' అని వదలివేయటంతోనే ఆమె తండ్రి 'ఏమంటావమ్మా' అని ప్రశ్నించాడు.

‘అవునులే... ఈ పండుగకు యీలాగే కానియ్యండి, పోనీ నాన్నా’ అంది.

‘సరే అలాగయితే’ అంటూ ఊరుకొన్నాడు సత్యనారాయణ మామ.

ఆయన వచ్చినపనిఅంతటితో పూర్తవటం వల్ల, మరి ఉండకుండా అంతటితో నిష్క్రమించాడాయన.

కళ్యాణి చిరుకోపం సత్యనారాయణరావుమీద ఒలకపోసింది. సత్యనారాయణరావు మనస్సులోమాత్రం కళ్యాణికి తన ఉద్దేశప్రకారం నడుచుకోటం యెంతో యిష్టం’ అనుకొన్నాడు.

కానయితే తండ్రి వెళ్ళివెళ్ళటం తోటే, కళ్యాణి కోపం ఒలకపోస్తూ ‘మంచి పనిచేశారు- వచ్చినవాళ్ళను వచ్చినట్లుగా పంపిస్తారు. కాస్త మంచి చెడ్డా యెప్పుడయినా యోచిస్తేగా అనింది.

సత్యనారాయణరావు తెల్లబోతూ అన్నాడు. ‘పోనీ వెళ్ళకపోయావా’ అని.

లేకపోతే యేమిటి చెప్పండి. ఇక్కడ చేసుకొనే పండగ అక్కడ చేసుకో కూడదూ. కొత్తగా మన్నితీసుకొని వెల్తున్నప్పుడు, వాళ్ళకు వాళ్ళే యెంతో ఆర్భాటంతో చెయ్యకుండావుంటారా?’ అని అంది కళ్యాణి.

‘ఓస్. చెయ్యరని నేనన్నానా?... ఇక్కడ మనం పొందే ఆనందం, అక్కడ మనం ప్రయత్నించితేమాత్రం లభ్యమాతుందేమిటి’ అన్నాడు సత్యనారాయణరావు.

‘ఏం ఎందుకు లభ్యంకాదూ? డబ్బు చేతినిండా ఉంటేసరి కొండమీద కోతినయినా దింపచ్చు. ఏం?’ అంది కళ్యాణి.

‘నే యెంత చెప్పినా నీకేం, అర్థంగాదు. నువ్వే చెప్పు... మనం అక్కడకెళ్ళినట్లయితే యీ బాణసంచా తయారుచేయటం ఎలా కుదురుతుంది’ అన్నాడు సత్యనారాయణరావు.

‘సరయితే బాగుంది. ఇంతకీ బాణసంచా తయారుచేసుకోటానికి వీలుండదని పంపటం మానారన్నమాట. బాగుందిలెండి ఎవరయినా వింటే నవ్విపోతారు’ అంది కళ్యాణి పకపక నవ్వుతూ.

‘చాల్లేమరి ఊరోక్క’- అన్నాడు సత్యనారాయణ... కళ్యాణి అంతటితో ఊరుకొనక తప్పిందికాదు.

ఆమర్నాడే బజారుకుపోయి సత్యనారాయణరావు అన్నిసరుకులూ తెచ్చాడు. కళ్యాణికి సత్యనారాయణరావుచేదస్తం చూసేసరికి ఎంతో కోపంవచ్చింది. కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా ఉండక, యేమిటీ కుఱ్ఱవాడివిధంగా, చిలిపి తనంపనులు చేయటం ఆమె కిష్టంలేదు.

సత్యనారాయణరావు భార్యచేత.. వస్తువులన్నీ విడదీయించి యెండబెట్టించాడు. కాచిన వేడినీళ్ళల్లో చన్నీళ్ళు పోసుకొనటానికి బద్ధకించే అతను, యెంతో శ్రద్ధగా సాయంకాలందాకా వాటిని కాపలాకాసి (కేవలం పనిలేనిమనిషి!) తిరిగి యెంతో జాగ్రత్తతో పొట్లాలుకట్టాడు.

కళ్యాణి కిదంతా చూస్తే... ఒకవైపునుంచి కోపం మరో వైపునుంచి అతని అమాయకత్వానికి జాలి, అతడు పడుతున్న శ్రమకు ఆనందం పొందసాగింది.

మర్నాడు... తెచ్చిన మంగులు దంచవలసివచ్చింది. కళ్యాణిని ప్రాధేయపూర్వకంగా కోరాడు సత్యనారాయణరావు ‘కాస్త యివి నూరిపెట్టవ్’ అని.

‘ఆఁ నూరిపెడతా... మీరు చేసినపనికి-’ అంది కళ్యాణి.

కళ్యాణి కాపురానికొచ్చిందిమొదలు యిప్పటివరకూ ఒక్కగా ఒక్క దెబ్బలాట వచ్చింది. ఆసమయంలో ఒకళ్ళతరహా ఒకళ్ళు తెలుసుకుందామని యిరువురూ చాలాకాలంవరకూ మాట్లాడుకోకుండానే ఉండిపోయారు. చివరకు అబలఅవటం వల్ల కళ్యాణే నోరుజారింది. మరి అలాంటి పరిస్థితి తర్వాత కల్గలేదు. నేటికి మళ్ళీ.

సత్యనారాయణరావు తిరిగి వెనకటి విధంగానే నడుచుకు పోదామనుకొన్నాడు కానయితే కాళ్ళుపట్టు కొన్నంత పని చేశాడు యీసమయంలో. ఆమెను బుజ్జ

ప్రమాదరక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడేప్రమాదం వచ్చేదీ, ఏక్షణం ఎలా ఉండేదీ తెలియని ఈదినాల్లో
అగ్ని * మోటార్‌కారు * కార్మిక నష్టపరిహారం
నౌకా * ఫయడిలిటీ గ్యారంటీ * మొదలైన భీమాలకు
మాతో సంప్రదించండి:

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ లిమిటెడ్,
“యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు”
ఎస్ప్లనేడ - మద్రాసు.

Telephone : 4241. Telegrams : “UNIGEN”

బ్రాంచీలు :
బొంబాయి - కలకత్తా - కొలంబో - సింగపూరు.

గించి, లాలించి... పైగా 'చక్కని చీర దీపావళి పండుగపేరుతో కొనిపెడతానని' వాగ్దానంచేసి.

కళ్యాణి యీమారు లొంగిపోయింది.. సత్యనారాయణరావు కోరినదల్లా చేసి పెట్టింది. సత్యనారాయణరావు కథమలుపు తిరిగినందుకు సంతోషించాడు. చకచక... మందులు నూరటం జరిగిపోయింది...

'ఏమేమి కట్టారు ?'— ప్రశ్నించింది కళ్యాణి పెద్దఊహల్తో. అమె ఉద్దేశ ప్రకారం సత్యనారాయణరావు దీపావళి పండుగంటే చెవికోసుకొంటున్నాడు కాబట్టి యే తారాజువ్వలో యే చెక్రాలో కడ్తాడని.

కానయితే సత్యనారాయణరావు తేల్చాడు 'ముత్యాల మతాబాలూ, చిచ్చుబుడ్లూ' అంతకంటె మరేంకావాలి నువ్వే చెప్పు-, అని.

కళ్యాణి ఫక్కున నవ్వింది. 'ఇంతాచేసి యీమాత్రమేనా మీరు చేసేది. ఒక ముత్యాల మతాబాలకోసం యింత హడావిడి..నిక్షేపంలాంటి పండుగ పాడుచేసుకొన్నారు-' అని అంది తిరిగి.

'చాల్లెద్దూ...మళ్ళా గొడవ చెయ్యకు'- అన్నాడు ప్రార్థనాపూర్వకంగా సత్యనారాయణరావు-

'ఊఁ' అంది కళ్యాణి అప్పటికి...

అప్పటికప్పుడే, పాళ్ళప్రకారం మచ్చు మతాబా తయారు చేశాడు సత్యనారాయణరావు. 'చాలా చక్కగా వెలిగింది' అని సంతృప్తిపడి, కళ్యాణి నడిగాడు 'ఏలాగుందని' 'బాగానే ఉంది' అంది సాగదీస్తూ, కళ్యాణి.

'ఇప్పుడు కలిపినది. కొట్టువాడిచ్చిన పాళ్ళప్రకారం కలిపాను. వాళ్ళు పాళ్ళ ప్రకారం యీ సరుకు పొట్లాలు కట్టారు- మరి... యీపాళ్ళ కడ్డులేదు' అంటూ రుఉషాగా మాట్లాడాడు సత్యనారాయణరావు.

మరి అంతటితో తనపని పూర్తయిందని తెలుసుకొని 'మరిచీర'— అంటూ జ్ఞప్తి చేసింది కళ్యాణి.

'ఓ- దానికేం- రేపు తెస్తాగా' అన్నాడు సత్యనారాయణరావు.

'రేపే'— అంటే నరకచతుర్దశి రోజన్న మాట.' అన్నమాటప్రకారం కళ్యాణికి చీరకొన్నాడు ఏభైరూపాయలు ఖర్చు పెట్టి సత్యనారాయణరావు.

'పుట్టింటిదగ్గర పడేపాటే యిక్కడా పడ్డానుకదా' అని సంతృప్తి వెలిబుచ్చింది కళ్యాణి.

అప్పటి కప్పుడు కట్టినసరుకు చాలా పసందుగా ఉంటుందని సత్యనారాయణరావు ఉద్దేశం. అందువల్లనే అంతవరకూ గొట్టాలుసహితం, తయారు చేసినా, మందు కలిపి, కూరటం జరపలేదు.

'మరి మందులు కలిపి గొట్టాల్లో కూరెయ్యండి. మరి ఆలస్యం యెందుకూ?' అని ప్రశ్నించింది కళ్యాణి. ఆమె దృష్టి యిటువైపు మరల్చగలిగినందుకు- సత్యనారాయణరావు ఆనందాన్ని వెలిబుచ్చాడు. 'ఆ అలాగే యిప్పుడే ప్రారంభించుతున్నా...' అన్నాడు సత్యనారాయణరావు సామాగ్రి సిద్ధపరచుకొని.

తిరిగి పాళ్ళు వేసుకొని మాదిరిచూసుకోవలసిందని కళ్యాణి సత్యనారాయణరావును హెచ్చరించింది. 'మరెందుకూ.. మొన్న.. మతాబా కాల్చిన పాళ్ళప్రకారం యీ రుకు, సరిపోయేలా కొట్టువాడు కట్టి యిచ్చాడు- మరి చూసుకొనవలసిన అవసరం ఉండదు'- అంటూ కలిపేశాడు సత్యనారాయణరావు.

ఎంతో జాగ్రత్తగా మందు కలిపి, దట్టంగా గొట్టాల్లో, చిచ్చుబుడ్లలోనూ కూరాడు. 'రేపురాత్రిదాకా ఒక్కటీ ముట్టుకొనటానికి వీల్లేదు - మనతడాఖా... ఒక్కగా ఒక్కసారే గుప్పున అందరూ తెలుసుకోవాలి, ఏమంటావ్?' అన్నాడు సత్యనారాయణరావు-

సరి... కళ్యాణికి వాటిమీద అసలు అభిరుచి లేనేలేదు. ముట్టుకొనటానికి వీల్లేదన్నప్పుడు, వాటిజోలికెళ్ళటం ఎందుకని మాట్లాడక ఊరుకొంది.

సత్యనారాయణరావు పిల్లవాడిలా బజారులోనికి పోయి మరో పదిరూపాయలు ఖర్చుపెట్టిముత్యాలమతాబాలు,చిచ్చుబుడ్లు మినహా వస్తువులు తీసుకొనివచ్చాడు.

'బాగుంది, మరీ పిల్లలయిపోతున్నారే' అంది కళ్యాణి-

'నీకేం తెల్సు- వీటి మజా.. రేపురాత్రి మతాబాముత్యాల్లో, ఈ రకరకాల సరులకు తళతళల్లో... నీ కొత్తచీర అందం కన్పిస్తుంది' అంటూ నవ్వాడు సత్యనారాయణ.

రోజు గడిచింది... రాత్రి వచ్చింది... పట్టణమంతటా తళతళలు, కన్పిస్తూంటే, టపటప వినిపిస్తూంటే, స్యతనారాయణరావు వీధిఅరుగుమీదకు సామగ్రితోవచ్చి కూర్చున్నాడు. కళ్యాణి కొత్తచీర కట్టుకొని భర్తగారి మతాబులు చూద్దామని వచ్చి కూర్చుంది.

సత్యనారాయణరావు వీధి అన్నివైపులా కలయచూశాడు ... అంతా కాల్చేస్తున్నారు- మనం ఉపక్రమించుదాం అంటూ మతాబాతీశాడు కాలుద్దామని ... ఎంత తీసినా అది కాలదే... మరోటి తీశాడు. అదీ అంతే...'మతాబాలకు దిష్టితగిలింది-' అన్నాడు విచారంతో సత్యనారాయణరావు- 'మీ దిష్టే దానికి తగిలింది...' అంది కళ్యాణి నవ్వుతూ.

'నీమూలంగానే యీలాగయింది' అంటూ కోపంవెడలగ్రక్కాడు సత్యనారాయణరావు.

'ఏం లేదు బాబూ.గంధకంపాలు యెక్కువైనట్లుంది. గుప్పున వాసనవేస్తూంది. మరి పనికిరావు... అలా పాడుచేశారేం-' అన్నాడు ప్రక్కింటి తాతయ్యగారు... అనుభవజ్ఞుడిలాగ చెబుతూ.

కళ్యాణి తిరిగి పకపక నవ్వింది. సత్యనారాయణరావు విచారం, ఉక్రోషం ఒకదానితర్వాత ఒకటిగా మిళితమయ్యాయి. కాని స్వహస్తాలతో చేసినవవటంవల్ల, వదల్లేక... తయారుచేసినవి మధ్య మధ్య అంటిస్తూ సంతృప్తిపడసాగాడు-

కళ్యాణి హేళనగా 'మతాబా..తళ.. తళలు ఒహో....' అనసాగింది.

సత్యనారాయణరావు గింజుకొనబోయేసరికి కళ్యాణినోరు మూతపడింది. కాని ప్రక్కింటి తాతయ్యగారు పెట్టిన రేడియో నోరుమ్మాత్రం తెరవబడింది... అందులోంచి వినపడుతోంది 'దీపావళీ.. దీపావళీ.. ఇంటింట ఆనందదీపావళీ.. మాయింట శోకాంధతిమిరావళీ' అన్నపాట.

కళ్యాణి నవ్వుతూంటే, సత్యనారాయణరావు మరికాల్చటం మాని... వీధుల్లో మతాబాల తళతళల్లో కలుగుతున్న కాంతితో... వెఱ్ఱివానిలాగ ఆమెకేసి చూడసాగాడు.

---


## నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నిక్కాక, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెని. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి-నెల్లూరు జిల్లా.